# ప్రవాసాంధ్రుల పేజీ

- సాక్షి.

## మేధావధానము 2008

శ్రీనివాసరామానుజన్ మేధమేట్రిక్స్ క్లబ్ (సంఘమిత్ర ఆధ్వర్యంలో) ఆగష్టు 2వ తారీఖున సెయింట్ లూయిస్ నగరములోని, తార్న్‌హిల్ గ్రంథాలయములోని హాలులో, మధ్యాహ్నము 1 గంట నుండి 4 గంటల వరకు మేధావధానము నిర్వహించింది. ఐదు సంవత్సరముల వయసు నుండి 15 సంవత్సరముల వయసు గల 14 మంది బాలబాలికలు, వందమందికి పైగా ప్రేక్షకులను ఆశ్చర్యములో ముంచెత్తారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాధామాధవ్ సొసైటీ (జగద్గురు కృపాలు పరిషత్ ఉపశాఖ) వ్యవస్థాపకులు శ్రీ సిద్దేశ్వరీ దేవి (దీదీజీ) హాజరయ్యారు. వారు ప్రేక్షకులకు అతి విలువైన సందేశాన్ని, విజ్ఞానమును అందించి, పిల్లలకు ప్రశంసాపత్రములను మరియు దీవెనలను అందించారు. ఆమె పిల్లలను, పెద్దలను కూడా ఉద్దేశించి జీవితములో విలువలను పాటించడం, తద్వారా నడవడికను మెఱుగు పెట్టుకోవడము అవసరమని వక్కానించారు. ఆమె భాగవతములోని శ్రీకృష్ణుని గురించిన కథలను చెప్పి, అందరూ ఎంతో ఆసక్తితో వినేటట్లు ప్రసంగించారు.



*ముఖ్య అతిథి సిద్దేశ్వరీదేవి (దీదీజీ)*




***మేధావధానము 2008 లో పాల్గొన్న బాలబాలికలు***

శ్రీనివాస రామానుజన్ మేథమేటిక్స్ క్లబ్ ప్రతి సంవత్సరము వేసవిలో రెండు నెలలపాటు తరగతులను నిర్వహిస్తుంది. ఈ తరగతులలో వేదగణితపద్ధతులు, సమస్యాపరిష్కారపద్ధతులు మొదలైన విషయములను నలుగురితో పంచుకోవడం జరుగుతుంది. ఈ మేధావధాన కార్యక్రమములో పిల్లలు నేర్చుకున్న విషయములను ప్రేక్షకుల సమక్షంలో ప్రదర్శించడము, తదనంతరము ప్రశంసాపత్రములు అందజేయడము జరిగింది. ప్రేక్షకులు ఇచ్చిన సంఖ్యకు ఘనమూలములను, పంచమ మూలములను, 9 తో భాగించినపుడు వచ్చు శేషము, ఐదు వరుసల కూడికను, 10 ఫిబనోకి సంఖ్యల మొత్తమును కనుగొనుట, 3 x 3 వింత చదరం, 4 x 4 చదరం, వారగణనం, 1/29, 1/59, 1/89 వంటి భిన్నమునకు ఆవృత దశాంశమును తెలుపుట, 13చే భాగించబడునట్లు 12 అంకెల సంఖ్యను ఏర్పరచుట మొదలైన అంశాలకు సమాధానములు చెప్పడం జరిగింది. ప్రేక్షకులు ఆవృత దశాంశమును ఎలా చెబుతున్నారు అని, 4 x 4 చదరమును ఎలా పూరిస్తున్నారు అని చాలా ఆత్రుతగా ఎదురుచూడడం జరిగింది. వారగణనమునకు సంబంధించిన ప్రశ్నలు చాలా మంది అడిగారు. పై ప్రశ్నలన్నిటికి పుస్తకము, కలము, గణనయంత్రము వంటివి ఉపయోగించకుండా నిమిషములోపలే సమాధానము చెప్పడం జరిగింది.




*కార్యక్రమము ప్రారంభమునకు ముందే విచ్చేసిన ప్రేక్షకులు*

ఈ కార్యక్రమములో సవిత బరగడ (8 వ తరగతి) పంచమ మూలములను, శ్రావ్య అయినాపురపు (5వ తరగతి) ఘనమూలములను మరియు వర్గములను (1 నుండి 100 వరకు), ఉపగ్య కొంపల్లి (8వ తరగతి) ఇచ్చిన సంఖ్యకు 11 యొక్క లబ్దమును, రుచా శుక్ల (9వ తరగతి) 11 చే భాగింపబడునట్లు 6 అంకెల సంఖ్యను ఏర్పరచడం, తన్వి కడియాల (4వ తరగతి) ఏవైనా రెండు వరుస సంఖ్యల వర్గముల భేదమును తెల్పిన ఆ సంఖ్యలను చెప్పడం, హరగోవింద్ (5వ తరగతి) ఐదు వరుసల కూడికను (ప్రేక్షకులు ఇచ్చిన నాలుగు అంకెల సంఖ్యకు తగినట్లు సమాధానము ముందే వ్రాయడం, ప్రేక్షకులు రెండవ మరియు నాల్గవ వరుసలను ఇస్తే, మూడవ మరియు ఐదవ వరుసలను వ్రాయడం), నమస్వి పాలడుగు (5వ తరగతి) 3 x 3 చదరమును పూరించడం, వినీత్ మెఱుగుమాల (6వ తరగతి) పది ఫిబనాకి సంఖ్యల మొత్తమును చెప్పడం, సన్నిత బరగడ (5వ తరగతి) ఇచ్చిన సంఖ్యను 9 చేభాగించగా వచ్చు భాగఫలమును చెప్పడం - ప్రేక్షకులను మంత్రముగ్దులను చేసినట్లు, కార్యక్రమము చివరివరకు ఆతృతతో వీక్షించడం విశేషం. శృతి అయినాపురపు (2వ తరగతి), భవ్య పెర్మ (1వ తరగతి), దీప శుక్ల (3వ తరగతి)ప్రేక్షకులు తలచుకున్న సంఖ్య (1 నుండి 31 వరకు) ఏ ఏ కార్డులలో ఉందో చెప్తే ఆ సంఖ్యను చెప్పడం; సోహన్ కందాడి (3వ తరగతి), అజయ్ మక్కెన (4వ తరగతి) కలిసి ప్రేక్షకులు తీసుకున్న 4 అంకెల సంఖ్యకు, దానిలోని అంకెల మొత్తమునకు గల భేదములోని 3 అంకెలు చెప్పిన నాలుగవ అంకెను చెప్పడం పిల్లలను,పెద్దలను కూడా అలరించింది.



*మేధమేటిక్స్ క్లబ్ గురించి వివరిస్తూ శ్రీనివాసరావు.*

తరువాత శ్రీనివాస రామానుజన్ మేధమేటిక్స్ క్లబ్‌ను నిర్వహించిన శ్రీనివాసరావు అయినాపురపు, తరగతులు నిర్వాహణకు వసూలు చేసిన రొక్కమును సంఘమిత్ర తరపున, ఇండియాలో ఎన్నో గ్రామములలో సేవలను అందిస్తున్న జగద్గురు కృపాలు హాస్పిటల్ లో వినియోగించుటకై సిద్ధేశ్వరీదేవికి (దీదీజీకి) అందజేసారు. తరువాత శ్రీనివాస రామానుజన్ మేధమేటిక్స్ క్లబ్‌ను నిర్వహించిన శ్రీనివాసరావు అయినాపురపు, తరగతులు నిర్వాహణకు వసూలు చేసిన రొక్కమును సంఘమిత్ర తరపున, ఇండియాలో ఎన్నో గ్రామములలో సేవలను అందిస్తున్న జగద్గురు కృపాలు హాస్పిటల్‌లో వినియోగించుటకై సిద్దేశ్వరీదేవికి (దీదీజీకి) అందజేసారు. కార్యక్రమములో భాగముగా ఆయన 4 x 4 చదరమును పూరించడము, 1/69కి 22 ఆవర్తన దశాంశములను తెలియజేయడము, ఇచ్చిన సంవత్సరము, నెల, తారీఖు ఆదారముగా వారమును గణించడము, 13చే భాగించబడునట్లు 12 అంకెల సంఖ్యను కూర్చడము చేసి పలువురిని మెప్పించారు. మధ్యమధ్యలో మేధమేటిక్స్ క్లబ్‌లో పిల్లలు నేర్చుకునే పద్ధతులు ఒకటి రెండు ఉదాహరణకు తెలియజెప్పారు. వచ్చే సంవత్సరము మేధమేటిక్స్ క్లబ్ కొఱకు

ఎదురుచూస్తామని కొందరు, వేసవి సెలవులలోనే కాకుండా మిగతా సమయములో కూడా ఈ పద్ధతులు నేర్పితే బాగుంటుందని చాలామంది అభిప్రాయమును వ్యక్తముచేసారు.

కార్యక్రమము చివరలో శ్రీనివాసరావు వేదగణితమునుండి ఒక పద్ధతిని వివరించి, ప్రేక్షకులకు బహుమతిగా అందించారు. ఈ కార్యక్రమము విజయవంతమవ్వడానికి తోడ్పడిన అందరికీ ఆయన హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేసారు. సంఘమిత్ర త్రైమాసిక పత్రిక (**http://www.sanghamitra.org**) గురించి, ఇండియాలో అన్నదానము, వస్త్రదానము, పుస్తకములు,



*కార్యక్రమాన్ని తన్మయత్వంతో వీక్షిస్తున్న ప్రేక్షకులు*

దుప్పట్లు (అవసరమైనంతవరకు కొన్ని కుటుంబములకు) అందజేస్తూ సంఘమిత్ర చేబడుతున్న కార్యక్రమముల గురించి తెలియజేసారు. *

*త్రికరణశుద్ధితో చేసిన పనులను దేవుడు మెచ్చును, లోకం మెచ్చును. - తాళ్ళపాక అన్నమయ్య.*

*బంగారమును గుర్తించడానికే పరీక్ష పెడతారు గాని, ఇనుపముక్కను ఎవరూ పట్టించుకోరు.*
*అలాగే వ్యక్తి సమాజములో ఎదిగే కొద్దీ తట్టుకోవలసిన పరీక్షలు చాలా ఉంటాయి.*